పట్టణంలో నాకాబందీ



నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి పోలీసులు నాకాబందీ నిర్వహించారు. విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 1వ పట్టణ సీఐ అంజుయాదవ్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని యువత అత్యుత్సాహం ప్రదర్శించకూడదన్నారు. రోడ్లపై కేకులు కట్ చేయడం నిషేధమన్నారు. ప్రశాంత వాతావరణంలో న్యూఇయర్ వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



గురుదక్షిణామూర్తి సన్నిధిలో రామేశ్వరం ఎమ్మెల్యే ఖాదర్‌బాషా అలియాస్ ముత్తు రామలింగం



అనంతపురం కలెక్టర్ గౌతమికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం ఎమ్మెల్యే ఖాదర్‌బాషా అలియాస్‌ముత్తు రామలింగం, అనంతపురం కలెక్టర్ గౌతమి దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు జయశ్యామ్ రాయల్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పవిత్రారెడ్డి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం శ్రీకాళహస్తిలో జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు పూల బొకేలను తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేక్‌లను కట్ చేయవద్దన్నారు. వాటి బదులు పేదలకు, విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను వారికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

గోశాలకు ఆవు, దూడ బహూకరణ



ఆవు, దూడను అప్పగిస్తున్న దాత సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు ఆదివారం తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు జిల్లా మేటపల్లికి చెందిన డి.సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు ఆవు, దూడతో పాటు వాటి సంరక్షణకు రూ.10వేలు వితరణ చేశారు. వీటిని పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి



కాళమనాయుడుపేటలో పంటల వివరాలను నమోదు చేస్తున్న ఎంపీఈఓ

సత్యవేడు: మండలంలోని రైతులందరూ తప్పని సరిగా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళి తెలిపారు. ఆదివారం వ్యవసాయ సిబ్బంది మండల పరిధిలో కాళమనాయుడుపేట, నరసరాజు అగ్రహారం గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లి ఈక్రాప్ చేసి, రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీఈఓ పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ జయ, రైతులు శ్రీనివాసరావు, రాధాకృష్ణయ్య, సుబ్రమణ్యం, వీరభద్రయ్య పాల్గొన్నారు.

శ్రీవరి సాగులో అన్నదాతలు



యంత్రంతో వేస్తున్న శ్రీ వరి పంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం, పల్లమాల, కాటూరు, కనమనంబేడు గ్రామాల్లో రైతులు యంత్రంతో శ్రీవరి పంటను వేస్తున్నారు. కాంపాళెం గ్రామంలోని 20 ఎకరాల్లో శ్రీ వరిపంట సాగుచేస్తున్నారు. శ్రీ వరి పంటను వేయడం వలన రైతులు అధిక దిగుబడిని సాధించవచ్చునని తెలిపారు. వరి పంట సాగు సులభతరమైందన్నారు. రైతులకు కూలీల సమస్య ఉండడంతో యంత్రముతో శ్రీ వరి పంటను వేయడానికి మక్కువ చూపుతున్నారు. శ్రీ వరిని సాగు చేయడం వలన ఎరువులను తక్కువ మోతాదులో వాడుకోవచ్చుని తెలిపారు. నీటి వాడకం తగ్గుతుందని, విద్యుత్ ఆదా అవుతుంది. కూలీలు నాటిన వరిపంటకంటే ఎకరాకు ఐదు బస్తాలు ధాన్యం పెరుగుతుందని, ఖర్చు తగ్గుతుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే పల్లమాల, కారణి గ్రామాల్లో శ్రీవరిని రైతులు సాగుచేస్తున్నారు. శ్రీవరిలో కలుపు ఉండదని, తెగుళ్లు ఎక్కువగా రావని, ధాన్యం నాణ్యతగా ఉంటుందని రైతులు అంటున్నారు.



వరిపంట

సుఖసంతోషాలు వెల్లివిరియాలి



శ్రీకాళహస్తి: కొత్త సంవత్సరంలో శ్రీకాళహస్తీరుడి ఆశీస్సులతో ప్రజలకు అంతా మంచే జరగాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆయన నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాక్షించారు. సీఎం జగనన్న సంక్షేమ పాలనతో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలన్నారు.

14 మంది కోడిపందెం రాయుళ్ల అరెస్టు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): కోడి పందెం ఆడుతున్న 14మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని కాసరం సమీపంలో ఆదివారం జరిగింది. తొట్టంబేడు ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. కాసరం గ్రామ పొలిమేరల్లో కోడిపందేలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కాసరం, చియ్యవరం, పుల్లూరు, తదితర గ్రామాలకు చెందిన 14మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి 4 పందెం కోళ్లు, రూ.3050 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి సిపాయి భరోసా



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం వాగవేడు పంచాయతీ యల్లంపల్లి ఎస్టీకాలనీకి చెందిన చెంచుకృష్ణమ్మ ఇటీవల మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆదివారం యల్లంపల్లి ఎస్టీకాలనీకి వెళ్లి కృష్ణమ్మ ఇంటికి చేరుకుని ఆమె కుమార్తె పల్లాల వనమ్మను పరామర్శించారు. వారికి 40 వస్తువులతో కూడిన సిపాయి భరోసా కింద నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి భవిష్యత్తులోనూ తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, డాక్టర్ వెంకటాద్రి, డాక్టర్ శ్రీను, వెంకటయ్య, వాసుదేవరెడ్డి, మూర్తి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు నూతన శోభ



జీఎన్‌కండ్రిగ: విద్యుద్దీపాలంకరణలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం



దీపాలంకరణలో పల్లమాల అభయ ఆంజనేయస్వామి ఆలయం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని దేవాలయాలు, చర్చిలు నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబయ్యాయి. జనవరి ఫస్టు వేడుకల కోసం దేవాలయాలకు, చర్చిలకు రంగులు వేసి, విద్యుద్దీపాలతో అలంకరించారు. దేవాలయాలు, చర్చి లోపల రకరకాల ప్లాస్టిక్ పూలను అలకరించారు. దీంతో మండలంలోని దేవాలయాలు, చర్చిల్లో పండుగ వాతవరణం వచ్చేసింది. మండలంలో జనవరి 1న దేవాలయాలలో ప్రత్యేక పూజలు, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో చర్చిల్లో ప్రార్థనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పలువురు మండలాధ్యక్షుల నియామకం

తొట్టంబేడు పార్టీ అధ్యక్షుడిగా శంకరయ్య



వెలంపాటి శంకరయ్య

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు మండలం పార్టీ అధ్యక్షుడిగా వెలంపాటి శంకరయ్య ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షులుగా సి.గురవారెడ్డి, పి.గిరిధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కె.మణి, ఎస్.జనార్ధన్ రెడ్డి, కె.అలంకార్, కోశాధికారిగా వి.వినాయకరెడ్డి నియమితులయ్యారు. అలాగే కార్యదర్శులుగా ఎస్.సురేష్, కె.వెంకయ్య, ఎ.చంద్రశేఖర్, టి.ముకుందంనాయుడు, సి.శేఖర్‌రెడ్డి, సభ్యులుగా కె.వెంకటయ్య, కె.ధనంజయరెడ్డి, జి.ఓంకార్, కె.ప్రకాష్‌రెడ్డి, పి.రమేష్‌రెడ్డి, కె.వీరయ్య, ఎస్.నాగూర్, బి.దామోదర్‌నాయుడు, జి.గురవయ్య, హరియాదవ్, కె.సుబ్బయ్య, వి.ధర్మారెడ్డి, చంద్రయ్యనాయుడు, ఎస్.మహేష్‌నాయుడు, రఘునాథరెడ్డిలను ఎంపిక చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం నియామక పత్రం విడుదల అయింది.

శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడిగా వయ్యాల కృష్ణారెడ్డి



వయ్యాల కృష్ణారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): వైఎస్సార్‌సీపీ శ్రీకాళహస్తి మండలం పార్టీ అధ్యక్షుడిగా వయ్యాల కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షులు జి.మురగయ్య, సీవీవీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా కె.గోపిగాడ్, బి.అంకయ్య, వి.కోటీశ్వర్ రావు, కోశాధికారిగా కె.సురేష్, కార్యదర్శులుగా డి.వెంకటరమణ, ఇ.హరిబాబు, కె.వెంకటేశ్వర్లు, జి.కోటేశ్వరయ్య, ఎస్.రవిశేఖర్‌బాబు, సభ్యులుగా సి.అంకయ్య, ఆర్.శివరామరాజు, ఓ.మురళి, యు.నవీన్, వి.ప్రసాద్‌నాయుడు, ఎ.పండయ్య, జి.జయచంద్ర, జె.వెంకటయ్య, జె.మత్తయ్య, వై.సుబ్బారావు, పి.మాధవయ్య, కె.సురేంద్రబాబు, షేక్ ఖాదర్‌బాషా, టి.సుబ్రమణ్యం ఆచారి, ఎస్.భద్రయ్యను ఎంపిక చేస్తూ ఈమేరకు నియామక పత్రాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం విడుదల చేశారు.

రేణిగుంట వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా రమేష్



గంగారి రమేష్

రేణిగుంట: మండలంలోని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా గాజులమండ్యంకు చెందిన గంగారి రమేష్ నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం మండల కమిటీని అధికారికంగా విడుదల చేసింది. పార్టీ మండల అధ్యక్షుడిగా గంగారి రమేష్, ఉపాధ్యక్షులుగా అత్తూరు త్రివిక్రమ్, కె.మునిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పాలమాకుల సుధాకర్, కె.గుణశేఖర్‌రెడ్డి, ఆర్.చెన్నకేశవులు, కోశాధికారిగా పి.ప్రకాష్, సెక్రటరీలుగా పి.నాగూర్, పి.వెంకటరెడ్డి, పీడీ బాబుప్రసాద్, ఆవుల యుగంధర్, బి.రాజేంద్రన్, ఈసీ మెంబర్లుగా పి.జాషువా, బి.మణి, ఎస్.మాధవరెడ్డి, ఎం.అప్పారెడ్డి, పి.ధనుంజయులు, పోలి నాగరాజును నియమించారు.

ఏర్పేడు మండల అధ్యక్షుడిగా రమణయ్య యాదవ్



రమణయ్య యాదవ్

ఏర్పేడు: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా కూనాటి రమణయ్య యాదవ్ ఆదివారం నియమితులయ్యారు. అలాగే ఆయనతో పాటు మండల పార్టీ ఉపాధ్యక్షులుగా మన్నెం రాజారెడ్డి, బి.సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శులుగా బిల్లు రాంబత్తెయ్య, ఎస్.సుబ్రమణ్యం, టి.భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా పీ.పెంచలరెడ్డి, కార్యదర్శులుగా ఏ.మునిరాజు రాయల్, టి.సంతోష్, జే.రమేష్, మధుసూదనరాజు, కిరణ్ నాయుడు ఎన్నికయ్యారు. అలాగే పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఏ.గిరిగౌడ్, ఈశ్వర్, ఎం.తేజ, కే.శివ, ఎస్.మల్లిఖార్జున యాదవ్, డి.బాలకృష్ణయ్య శెట్టి, ఎంఎస్ బత్తిరెడ్డి, టి.మోహన్‌కృష్ణ గౌడ్, కే.రఘు, సీ.వెంకటేష్, వై.పెరుమాల్‌తో కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలి



వరదయ్యపాళెం: ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆకాంక్షించారు. ఆదివారం ఆయన నియోజకవర్గంలోని ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన ఆంగ్ల సంవత్సరంలో ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతిఒక్కరి జీవితంలో చీకట్లు తొలగి వెలుగులు నిండాలన్నారు. జగనన్న పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, భవిష్యత్‌లో కూడా ఇదే ఒరవడి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

నాగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



పార్వతి దేవి అమ్మవారికి అలంకరించిన బంగారు చీర

సూళ్లూరుపేట రూరల్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న నాగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యంరెడ్డి విశేష కృషి చేస్తున్నారు. తన సొంత నిధులతోపాటు దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి చేస్తున్నారు. పార్వతి దేవికి సుమారు రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసి బంగారు చీర తయారు చేయించారు. దుకాణాల సముదాయం శిథిలావస్థకు చేరడంతో దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడి సుమారు రూ.20 లక్షలతో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. సుమారు రూ.15 లక్షల నిధులతో ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేయించారు. కల్యాణ మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.

అత్యాధునిక పద్ధతులతో కంటి వైద్య పరీక్షలు

చిల్లకూరు : గూడూరు పట్టణం ఐసీఎస్ రోడ్డులో ఉన్న ప్రవీణ్ ఐ కేర్ ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతిలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్నట్టు డాక్టర్ సత్యశ్రీ తెలిపారు. సత్యశ్రీ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కంటి రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కంటి వైద్య శిబిరాల్లో పాల్గొని చికిత్స చేస్తున్నట్టు పేర్కొన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేస్తున్నామని వివరించారు. పేదలు ఆధార్, రేషన్‌కార్డు, ఫొటో తీసుకుని రూ.10 వేల వరకు ఖర్చు అయ్యే ఆపరేషన్లను ఉచితంగా చేస్తామన్నారు. కంటి శుక్లం ఆపరేషన్లు సుమారు 5 వేల వరకు విజయవంతంగా చేసినట్టు పేర్కొన్నారు. నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నామని, వ్యక్తి మృతి చెందిన కొద్ది గంటలలోనే వారి నేత్రాలు సేకరిస్తే మరొకరికి చూపు తెప్పించవచ్చన్నారు. ప్రజలు నేత్రాలను దానం చేయాలని సూచించారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం

రాపూరు : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి ఆదివారం ఇద్దరు దాతలు రూ.లక్ష చొప్పున రూ.రెండు లక్షలు విరాళం ఇచ్చినట్టు ఈవో జనార్ధన్ రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం చిట్టేపల్లికి చెందిన మోదేపల్లి కృష్ణప్రసాద్, రాధ దంపతుల కుమారుడు జయసింహా, కుమార్తె దివ్యశ్రీ రూ.1,00,116, పల్నాడు జిల్లా అమరావతి మండలం మునగోడు గ్రామానికి చెందిన ముక్కమళ్ల రామస్వామిరెడ్డి రూ.1,00,116 ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, జేఈ వినోద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పక్షుల కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆ సమయంలో చెరువు కట్టపై ఉన్న ఓ వ్యూపాయింట్ వద్ద గూడూరు పట్టణానికి చెందిన పాఠశాల విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందుతోందా అని తెలుసుకున్నారు. ఆయన వెంట సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎఫ్ఆర్వో భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ తిరుమలరావు ఉన్నారు.

క్రికెట్ విజేత గూడూరు ఎస్కేఆర్ కళాశాల జట్టు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర కళాశాలల గూడూరు జోన్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గూడూరు ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నిలిచినట్లు పీడీ పి.నారాయణరాజు తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన మొదటి సెమీ ఫైనల్‌లో ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎస్కేఆర్ జట్టు 149 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల జట్టును 103 పరుగులకే ఆలౌట్ చేసింది. మరో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో వైష్ణవి డిగ్రీ కళాశాల వెంకటగిరి, శ్రీనివాస డిగ్రీ కళాశాల గూడూరు జట్లు పాల్గొన్నాయి. మొదటి బ్యాటింగ్ చేసిన వైష్ణవి కళాశాల జట్టు 130 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీనివాస డిగ్రీ కళాశాల జట్టును 80 పరుగులకే ఆలౌట్ చేసి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గూడూరు, వైష్ణవి డిగ్రీ కళాశాల వెంకటగిరి జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేపట్టిన వైష్ణవి డిగ్రీ కళాశాల జట్టు 7 వికెట్లు నష్టపోయి 96 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గూడూరు ఎస్కేఆర్ డిగ్రీ కళాశాల జట్టు 96 పరుగుల విజయ లక్ష్యాన్ని జట్టు కెప్టెన్ వాసుదేవ శర్మ, టీమ్ సభ్యుల అద్భుత ప్రతిభ చూపి అవలీలగా ఛేదించి గూడూరు జోన్ విజేతగా నిలిచింది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసులు, విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిశీలకులు ఎ.ప్రవీణ్‌కుమార్, కళాశాల ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కె.పి.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో ఎన్‌బీకేఆర్ విద్యార్థి ప్రతిభ



సిల్వర్ మెడల్ సాధించిన వలిపి హిమతేజ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థి వలిపి హిమతేజ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటాడు. మహారాష్ట్రలోని బల్లాపూర్‌లో జరిగిన 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో 100 మీటర్ల పరుగు పందెంలో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. విద్యార్థిని ఆదివారం కళాశాల కోఆర్డినేటర్ రాజేష్, అధ్యాపకులు అభినందించారు.

కండలేరులో 13.008 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 13.008 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటరీ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో ఎన్ఎస్ఎఫ్ క్రీడాకారుల ప్రతిభ

నాయుడుపేట టౌన్ : చెన్నైలో ఆదివారం జరిగిన అథ్లెటిక్ పోటీల్లో నాయుడుపేట ఎన్ఎస్ఎఫ్ క్రీడా కారులు ప్రతిభ చూపినట్లు ఎన్ఎస్ఎఫ్ ఫౌండర్ మోమిడి లక్ష్మయ్య తెలిపారు. అండర్ 10 బాలికల విభాగంలో మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో నాయుడుపేటకు చెందిన ఎం మయూరి ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం, రూ.2 వేల నగదు, ట్రోఫీని అందుకున్నట్లు వెల్లడించారు. బాలుర విభాగంలో ఎం.మహీధర్ 4వ స్థానం, అలాగే సీనియర్ విభాగంలో సైతం 5 కిలోమీటర్ల పరుగు పందెంలో 4వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. నాయుడుపేటకు చెందిన ఇద్దరికి నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను తమిళనాడు పరిశ్రమ శాఖ మంత్రి తిరుతంగం తెన్నరసు చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు.

సీఎం జగనన్నతోనే ప్రజాసంక్షేమం

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపీ గురుమూర్తితో కలిసి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి 23వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వారికి స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వారికి ఈ ప్రభుత్వంలో కలిగిన లబ్ధిని వివరించి, సంక్షేమ బావుటా అందించారు. అనంతరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ స్థాయిలో ప్రజాసంక్షేమం గురించి ఆలోచించలేదన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల బాగు గురించి ఆలోచిస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. అనంతరం వారు ప్రజలను అడిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 ఏళ్లల్లో జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్లలో జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాసంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే 23వ వార్డులో పర్యటనకు వస్తుండడంతో స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన తంజావూరు కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో జనార్ధన రావు పవార్, లోకేష్‌యాదవ్, సిరాజ్‌బాషా, ఎంఆర్ మురళి, సురేష్, మీర్జా, నంద, జయ, శివకుమార్, షబ్బీర్, ఇదియతుల్లా, మహేష్, ప్రసాద్‌యాదవ్, బుజ్జమ్మ, బండి శంకరముని, సిద్దు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి, ఎంపీ గురుమూర్తికి దిష్టి తీస్తున్న మహిళలు



కళాకారుల విన్యాసాలు



ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడి, ఎంపీ గురుమూర్తిని సన్మానిస్తున్న నాయకులు



ఎమ్మెల్యే, ఎంపీ గురుమూర్తికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

మండల వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి పార్టీ మండల కమిటీలను నియమించారు. ఇందుకు సంబంధించి ఎంపికైన వారి జాబితాను ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది.

పార్టీ కమిటీల వివరాలు:

1) వరదయ్యపాళెం మండలం
అధ్యక్షుడు: నాయుడు దయాకర్‌రెడ్డి
ఉపాధ్యక్షులు: ఈ. రాజేంద్రప్రసాద్, వి. శ్రీనివాసులు
ప్రధాన కార్యదర్శులు: ఎం. అబ్దుల్ మజీద్, కె.పరంధామరెడ్డి, ఆర్.విద్యాసాగర్
కోశాధికారి: కె.మోహన్

2) సత్యవేడు మండలం
అధ్యక్షుడు: కె. సుశీల్‌కుమార్ రెడ్డి
ఉపాధ్యక్షులు: జి. పునిదకుమార్, పి. రమేష్
ప్రధాన కార్యదర్శులు: ఏ. గురునాథం, వీడీ శరవణన్, ఎస్.సెంథిల్‌కుమార్, వి. సురేందర్ రెడ్డి

3) పిచ్చాటూరు మండలం
అధ్యక్షుడు: కె. వెంకటచలపతిరాజు
ఉపాధ్యక్షులు: వి. సుబ్రమణ్యం, డి. రమేష్‌రాజు
ప్రధాన కార్యదర్శులు: కె. రామచంద్రయ్య, వి. ఏసుదాసు, కె.ఆర్ముగం రెడ్డి
కోశాధికారి: కె. కిరణ్‌కుమార్

4) నారాయణవనం మండలం
అధ్యక్షుడు: ఈ. సారకాయలు
ఉపాధ్యక్షులు: బి. దివాకర్‌రెడ్డి, ఎం.భారతి
ప్రధాన కార్యదర్శులు: కోనేటి బాబు, ఎస్. సుబ్రమణ్యం, ఈ.పూంగొడి, కె.సాయిరవిరెడ్డి

5) నాగలాపురం మండలం
అధ్యక్షుడు: ఎస్. అపరంజిరాజు
ఉపాధ్యక్షులు: టి. ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎం.శ్యామన్
ప్రధాన కార్యదర్శులు: ఆనంద్, సి. జగదీష్‌రెడ్డి, టి. కులశేఖర్‌రెడ్డి, విశ్వ

6) కేవీబీపురం మండలం
అధ్యక్షుడు: గవర్ల కృష్ణయ్య
ఉపాధ్యక్షులు: బి. వెంకటమ్మ, వి. మురళీమోహన్‌రెడ్డి
ప్రధాన కార్యదర్శులు: వి. అయ్యప్ప, వి. బాలసుబ్రమణ్యం, ఎం. రఘురామ్
కోశాధికారి: గాలి దయాకర్

7) బీఎన్‌కండ్రిగ మండలం
అధ్యక్షుడు: ఆరణి విద్యానాథరెడ్డి
ఉపాధ్యక్షులు: వి. వెంకటయ్య, డి. సంజీవయ్య
ప్రధాన కార్యదర్శులు: డి.తులసీరామ్, ఎస్.బాలాజి, కె.అజేయ్‌కుమార్ రెడ్డి, బి.పుట్టయ్య

వర్షాలకు పెద్ద పాండూరు–తొండంబట్టు రోడ్డు ధ్వంసం

- వరద బీభత్సానికి 200 మీటర్ల మేరకు ధ్వంసమైన బీటీ రోడ్డు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు నుంచి తొండంబట్టు మీదుగా సిద్ధాపురం వరకు నిర్మించిన బీటీ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైంది. పెద్ద పాండూరు రాళ్లకాలువ లోలెవల్ కాజ్‌వే నుంచి కుప్పట తాగేలి సమీపం వరకు 200 మీటర్లు పూర్తిగా ధ్వంసమైంది. తారురోడ్డు కాస్త మెటల్ రోడ్డుగా మారిపోయింది. ఎన్నో ఏళ్లుగా ఈ మార్గానికి తారు రోడ్డు లేక ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 10 గ్రామాల ప్రజలు ఆ ప్రాంత రోడ్డు నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి విన్నవించారు. వారి విన్నపం మేరకు పంచాయతీరాజ్ ద్వారా బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే నివేదించారు. తక్షణమే ఈ మార్గంలో 5.5 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 3.75కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి ఏడాది క్రితం ఎమ్మెల్యే చేతుల మీదుగా రోడ్డును ప్రారంభించి ఆ ప్రాంత ప్రజల రాకపోకలు సుగుమం చేశారు. అయితే వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో మళ్లీ ఆ ప్రాంత ప్రజల వాహన రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు పునరావృతమయ్యాయి. రోడ్డుకు ఓవైపు రాళ్లవాగు ఏరు ప్రవహిస్తుండడంతో భారీ వర్షాలకు రోడ్డుపైకి వరదనీరు పొల్లి రోడ్డు అవతలివైపునకు నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుపై ఉన్న తారు లేయర్ పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రభుత్వం స్పందించి వరద నష్టం కింద నిధులు మంజూరు చేసి తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు ధ్వంసమైన పెద్ద పాండూరు-తొండంబట్టు రోడ్డు



వర్షాలకు కోతకు గురైన తారు రోడ్డు

పైరుకు చేటు.. రైతుకు పోటు

- విరివిగా నిషేధిత పురుగు మందుల విక్రయాలు
- బిల్లులు ఇవ్వకుండా మోసం
- ఎరువులు సైతం అధిక ధరలు
- పట్టించుకోని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

పంటకు హానిచేసే పురుగు మందుల విక్రయాలపై నిషేధం ఉన్నా సత్యవేడు నియోజకవర్గంలో కొందరు వ్యాపారులు ఖాతరు చేయడం లేదు. యథేచ్ఛగా విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. లైసెన్సులు లేకపోయినా దర్జాగా పురుగు మందుల వ్యాపారం చేస్తున్నారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తూ రైతులను నిలువునా దోపిడీకి గురిచేస్తున్నారు.

వరదయ్యపాళెం: రసాయన ప్రమాణాలు పాటించకుండా కొన్ని కంపెనీలు మందులను తయారుచేసి ఏ విధమైన ముద్రలు లేకుండా వాటిని విక్రయ దుకాణాలకు సరఫరా చేస్తున్నాయి. ఈ మందులను సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, సత్యవేడు, కేవీబీపురం, నాగలాపురం, పిచ్చాటూరు, బీఎన్‌కండ్రిగ, నారాయణవనం మండలాలకు చెందిన వ్యవసాయ డీలర్లు తమ దుకాణాలు, గోడౌన్లలో భారీ మొత్తంలో నిల్వ చేసుకుని రైతులకు అంటగడుతున్నారు. ప్రస్తుతం వరి పైరులో దోమ కాటు నివారణకు తప్పనిసరిగా పురుగు మందును పిచికారీ చేయాల్సి ఉంది. ఇదే అదునుగా వ్యాపారులు నిషేధిత మందులను రైతులకు అంటగట్టి భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాపారులకు రూ. 200 నుంచి రూ.300లకు వచ్చే మందులను వెయ్యికిపైగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రూ. లక్షల వ్యాపారం చేస్తే వ్యాపారులకు సింగపూర్, బ్యాంకాక్, మలేషియా ట్రిప్పులు ఇస్తామంటూ మందుల కంపెనీలు వల వేస్తున్న సందర్భాలు అనేకం. దుకాణాల యజమానుల నుంచి వ్యవసాయాధికారులు లబ్ధి పొందుతూ నిషేధిత పురుగు మందుల విక్రయాలకు ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు వస్తున్న సమయంలో కిందిస్థాయి అధికారులే వ్యాపారులకు సమాచారం ఇచ్చి జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.



వరదయ్యపాళెంలో లైసెన్సు లేకుండా పురుగు మందులు విక్రయిస్తున్న ఎల్లమ్మ ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

ఈ ఫొటోలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తున్న ఎరువులు, పురుగు మందుల దుకాణం వరదయ్యపాళెంలోనిది. ఈ దుకాణంలో కొంతకాలంగా లైసెన్సు లేకుండా విచ్చలవిడిగా పురుగు మందుల విక్రయాలు జరిగాయి. వ్యవసాయ అధికారులు తమకేమీపట్టనట్లు వ్యవహరించడంతో ముందస్తు సమాచారం అందుకున్న తిరుపతి విజిలెన్స్ అధికారులు ఇటీవల ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో పురుగు మందుల అక్రమ వ్యాపారం బయటకు పొక్కింది. ఈ సందర్భంగా రూ.2.50లక్షల విలువ చేసే నిషేధిత పురుగు మందులను సీజ్ చేశారు. సత్యవేడు డివిజన్ పరిధిలో 24 ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఉన్నాయి.

వేరువేరుగా రేట్లు

ఒక్క వరదయ్యపాళెం మండలంలోనే ఎరువుల ధరలు వేరువేరుగా ఉన్నాయి. యూరియా బస్తాపై ఎమ్మార్పీ రేటు రూ. 267 ఉండగా వరదయ్యపాళెంలో రూ. 300, చిన్న పాండూరులో రూ. 300లకు విక్రయిస్తున్నారు. అంతేకాక ఫాస్ఫేట్ ఎరువు బస్తాకు రూ. 30 నుంచి రూ. 50 వరకు అదనంగా విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పురుగు మందులు కూడా వరదయ్యపాళెంలో ఓ రేటు, చిన్న పాండూరులో మరో రేటుతో దోచేస్తున్నారు. అధికారులు స్పందించి నిషేధిత మందుల విక్రయం జరగకుండా చర్యలు తీసుకోవాలని, దుకాణాల వద్ద ధరల బోర్డులు పెట్టాలని కోరుతున్నారు.

ఆర్బీకేలలో రూ. 267కే యూరియా బస్తా

రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో మాత్రం యూరియా బస్తాను రూ. 267కే విక్రయిస్తున్నారు. ఫాస్ఫేట్ ఎరువులు కూడా ఎమ్మార్పీ ధరకే విక్రయిస్తున్నారు.



వరదయ్యపాళెంలోని పురుగు మందుల దుకాణం

ఆ ఏడు మండలాల్లో రూ.కోట్లలో వ్యాపారం

సత్యవేడు నియోజకవర్గంలో ప్రస్తుత రబీ సీజన్‌కు 14వేల హెక్టార్లకుపైగా వరిపంటను సాగు చేస్తున్నారు. ఆ మేరకు వ్యవసాయశాఖ సత్యవేడు డివిజన్ పరిధిలో 24 ఎరువులు, పురుగు మందుల దుకాణాలున్నాయి. అందులో వరదయ్యపాళెం, సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాలు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా వరదయ్యపాళెం మండలంలో 10 దుకాణాలు ఉన్నాయి. ప్రతి ఏడాది పురుగు మందులు, ఎరువుల విక్రయాలకు సంబంధించి డివిజన్ పరిధిలో రూ. 25 కోట్లకుపైగా వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. రైతులకు మందులపై అవగాహన లేకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టమొచ్చినట్లు రేట్లకు అంటగడుతున్నారు. అయితే పురుగు మందులను అధికంగా వాడితే దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. ఈ మందులను పిచికారీ చేసే రైతుల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందన్నారు.

బిల్లులు ఇవ్వడం లేదు..



ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు సంబంధించి రైతులకు డీలర్లు బిల్లులు ఇవ్వడం లేదు. గతంలో తాను చిన్న పాండూరులోని ఓ పురుగుమందుల దుకాణంలో మందులు కొనడానికి వెళ్లాను. అయితే కొనుగోలు చేసిన తర్వాత బిల్లడిగితే ఇచ్చేది లేదు అని దురుసుగా మాట్లాడడమేకాక తాను నిలదీసి అడిగినందుకు కేసులు బనాయిస్తానని హెచ్చరించారు. మండల పరిధిలోని దుకాణాల వద్ద ప్రభుత్వ నిబంధనల మేరకు ఎక్కడా ధరల బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.

–భాస్కర్ రెడ్డి, రైతు, పెద్ద పాండూరు

డీలర్ల దోపిడీ..



కూతవేటు దూరంలో ఉన్న తమిళనాడులో అత్యంత చౌకగా పురుగు మందులు లభిస్తున్నాయి. సమీపంలోని తమిళనాడు ఆరంబాకంలో ఒకే కంపెనీకి చెందిన పురుగు మందు లీటరు రూ. 500కు విక్రయించగా వరదయ్యపాళెంలో అదే మందు రూ.1000, చిన్న పాండూరులో రూ.1200లకు విక్రయిస్తున్నారు. ఆ దశగా ప్రతి మందులో ధరలలో తేడాలున్నాయి. వరదయ్యపాళెం మండలంలో అధిక ధరలకు విక్రయించడమే కాకుండా నకిలీ మందులను కూడా రైతులకు అంటగట్టి డీలర్లు దోపిడీ చేస్తున్నారు.

–రవి, రైతు, వెంగారెడ్డికండ్రిగ

సమాచారం లేదు..



నిషేధిత పురుగు మందులను విక్రయిస్తున్నట్లు సమాచారం లేదు. నిబంధనలకు విరుద్ధంగా మందులను విక్రయించే షాపులను తనిఖీ చేస్తాం. వారిపై కేసులు నమోదు చేస్తాం. ధరల తేడాల గురించి విచారిస్తాం. రైతు భరోసా కేంద్రాల్లోనే ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయిస్తున్నాం. రైతులందరూ స్థానికంగా ఉన్న ఆర్బీకేలలోనే కొనుగోలు చేసుకోండి. అధిక ధరల విషయమై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–జె. సుబ్రమణ్యం, ఏడీఏ, సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్